
# సాక్షి నిర్మల్

ఆదివారం । 9 । ఏప్రిల్ । 2023



**వీరి 'పేరే'మి..!** 8లో▸

పిల్లలు పుట్టగానే మంచి పేరు పెట్టాలనే తపన తల్లిదండ్రుల్లో కనిపిస్తుంది. అయితే ఒకే రకమైన పేర్లు.. ఒకే ఊరిలో ఉన్న వారు చాలామందే ఉన్నారు. ఆ పేర్ల వెనుక చరిత్రపై ప్రత్యేక కథనం.




**స్పర్శతో పసిగడుతారు..**

ఆ విద్యార్థులు స్పర్శతోనే అన్ని చెబుతారు.. కళ్లకు గంతలు కట్టుకుని పేపర్‌పై గీసిన బొమ్మలను, రాసిన పేర్లను చెబుతారు లక్ష్మణచాంద కస్తూరిబాగాంధీ విద్యార్థినులు. 9లో▸

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం
36.3 /24.8

ఆకాశం పాక్షికంగా మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. గాలిలో తేమ శాతం పెరిగి ఉక్కపోతగా పెరుగుతుంది. సాయంత్రం చినుకులు పడే అవకాశం ఉంది.




## న్యూస్‌రీల్

### పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి బయటకు వస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

ముథోల్: మండల కేంద్రంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్ రాంబాబు శనివారం తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రవీంద్ర ఉన్నత పాఠశాలలో పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

**పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి**

పెంబి: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి సూచించారు. మండల కేంద్రంలో జెడ్పీహెచ్ఎస్‌లో జరుగుతున్న పదో తరగతి పరీక్షలను డీఈవో రవీందర్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. మాస్ కాపీయింగ్ జరుగకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు.

### 10న దేశవ్యాప్తంగా నిరసన

నిర్మల్‌చైన్‌గేట్: విశ్రాంత ఉద్యోగుల అపరిష్కృత సమస్యల పరిష్కారం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఉద్యోగ వ్యతిరేక విధానాలపై అఖిల భారత రాష్ట్ర పెన్షనర్ల సమాఖ్య న్యూఢిల్లీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు ఈనెల 10న దేశవ్యాప్తంగా నిరసన తలపెట్టినట్లు పెన్షనర్ల సంఘం జాతీయ కార్యదర్శి ఎంసీ.లింగన్న తెలిపారు. కలెక్టరేట్ల ఎదుట నిర్వహించే నిరసనలో విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

### బీసీలను అణచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర

- ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి నర్సాగౌడ్

ఖానాపూర్: సీఎం కేసీఆర్ ప్రభుత్వం బీసీలను అణచివేసేందుకు కుట్ర చేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్ ఆరోపించారు. ఈ క్రమంలోనే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై తప్పుడు కేసు పెట్టించి అక్రమంగా అరెస్ట్ చేయించిందని పేర్కొన్నారు. మండలంలోని సత్తనపల్లి గ్రామంలో పల్లెపల్లెకు ఓబీసీ–ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ అగ్రకుల అహంకారంతో బలహీన వర్గాలపై నిర్బంధకాండ సాగిస్తున్నారని ఆరోపించారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న బీఆర్ఎస్‌కు ఐక్య ఉద్యమాలతో బుద్ధి చెప్పాలన్నారు. బీసీలకు బీజేపీ అండగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టేకు ప్రకాశ్, గుడాల రాజన్న, పుప్పాల పవన్, మేకర్తి సత్యనారాయణ, కాలేరి రాజేందర్, బుక్యా శైలేందర్, అడప దేవన్న, కోరుకంటి పోశెట్టి, రాజమల్లు, మల్లేశ్, లచ్చన్న పాల్గొన్నారు.

### దుకాణాలకు ధ్రువపత్రాలు తప్పనిసరి



సోదాలు నిర్వహిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

దస్తురాబాద్: దుకాణాల యజమానులు గ్రామ పంచాయతీ లేదా మున్సిపాలిటీ ట్రేడ్ లైసెన్స్, ఫుడ్ సేఫ్టీ ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వాసు అన్నారు. మండల కేంద్రంలోని పలు దుకాణాలను శనివారం తనిఖీ చేశారు. చాలా దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ లేదని గుర్తించారు. వారం రోజుల్లో అందరూ ట్రేడ్ లైసెన్స్, ఫుడ్ సేఫ్టీ సర్టిఫికెట్ తీసుకోవాలని సూచించారు. వారం తర్వాత లైసెన్స్, ధ్రువీకరణ లేకుంటే షాపు సీజ్ చేస్తామని హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఓ దుకాణంలో నిత్యావసర సరుకుల శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం తరలించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సోదాలు నిర్వహిస్తున్నారని తెలియడంతో చాలామంది యాజమానులు దుకాణాలు మూసివేశారు. తనిఖీల్లో సిబ్బంది షకీల్, రహీం తదితరులు పాల్గొన్నారు.

# కలిసుంటేనే బలగం!



నిర్మల్‌రూరల్ మండలం వెంగ్వపేటకు చెందిన తోడిశెట్టి భోజన్న బలగం

- అన్నదమ్ములుండాలె
- అక్క రావాలె.. బావనూ పిలువాలె
- అనుబంధాలను తట్టిలేపుతున్న సినిమా
- కరుగుతున్న కఠిన హృదయాలు.. చెమరుస్తున్న కళ్లు
- కోల్పోయిన బంధాన్ని తెరపై ఆవిష్కృతం..
- కలిసిపోతున్న కుటుంబాలు

**సండే స్పెషల్**

నిర్మల్:

'తోడుగా మా తోడుండి..
నీడగా మాతో నడిచి..
నువ్వెట్లా వెళ్లినావు కొమురయ్యా..
నీ జ్ఞాపకాలు మరువామయ్యో కొమురయ్యా..
కొడుకునెట్లా మరిచినావే కొమురయ్యా.. నీ బిడ్డనెట్లా మరిసినావే కొమురయ్యా..'

అంటూ తెరపై వస్తున్న పాటతో పాటే చాలామంది కళ్లు చమరుస్తున్నాయి. హృదయం ద్రవిస్తోంది. అప్రయత్నంగానే గుండె బరువెక్కుతోంది. ఇది బలగం సినిమాలోని పాట. ఇప్పుడు ఈ సినిమా ఎంతలా ప్రభావం చూపుతుందో తెలిసిందే. కానీ.. ఆ ప్రభావం చూపడం వెనుకున్న కారణమేందో.. కొందరికే ఎరుక. ఆస్తులు, అసూయల గోడలు కట్టి, ఏళ్లుగా నా అనుకున్నవాళ్లను దూరంపెట్టి, బంధాలు, అనుబంధాలు, ఆప్తులు అనే మాటలు లేక చాలా గుండెలు రాయిగా మారాయి. అచ్చంగా తమలోని తప్పులను, తమకే తెలియకుండా దాగివున్న ప్రేమలను తెరపై చూసే సరికి ఇలా అప్రయత్నంగా కఠిన హృదయాలు కరుగుతున్నాయి. గుండెల్లో నుంచి బాధ తన్నుకువస్తోంది. సుడులుసుడులుగా కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి. ఎన్ని ఆస్తులున్నా.. నీకెంత మంది ఆప్తులున్నారన్న లెక్క మనకు వస్తుంటే, గొంతులో తడారి పోతోంది. సరిగ్గా ఇలాంటి సందర్భంలోనే 'మనకంటూ కాకి లెక్క బలగం ఉండాలె బిడ్డా..' అని పెద్దలు చెప్పిన మాట యాదికొస్తోంది.

### అన్నదమ్ములను కలిపింది..

బలగం సినిమా చూపెట్టడం వల్ల లక్ష్మణచాంద మండల కేంద్రానికి చెందిన అన్నదమ్ములు గుర్రం పోసులు, రవి కలిసిపోయారు. చిన్నపాటి గొడవలతో ఏళ్ల క్రితం వీరు విడిపోయారు. అన్న, తమ్ముడు అనే బంధాలు దూరమయ్యాయి. ఇటీవల బలగం సినిమా చూసిన ఇద్దరూ మరుసటి రోజు సర్పంచ్ ముత్యంరెడ్డి వద్దకు వెళ్లి కలిసిపోతాం.. అని చెప్పారు. చెప్పినట్లుగా కలిసిపోయారు.



### 'ఉమ్మడి' విడివడి..

ఒకప్పుడు అన్నీ ఉమ్మడి కుటుంబాలే. అన్ని ఇళ్లలో రోజూ సందడిగా పండుగ వాతావరణమే. ప్రధానంగా పల్లెల్లోనైతే చుట్టబంతి ఇళ్లలో కలిసి ఉండే కుటుంబాలు ఏ బాదరాబందీ లేకుండా హాయిగా జీవనం సాగించేవి. అన్నాతమ్ముడు, అక్కా బావా, వదినా మరదలు, తాతా మనుమలు.. ఇలా ఎన్నో బంధాలు ఒకే గూటికింద ఉండేవి. ఎవరికి ఏ వచ్చినా బలగాన్ని చూస్తే సగం బాధ తొలగిపోయేది. పొద్దంతా ఎవరి పనుల్లోకి వారు వెళ్లినా రాత్రి మాత్రం అందరూ కలిసి ఒకేదగ్గర కూర్చొని తినేవారు. మంచి, చెడుకూ ఒకరికొకరు తోడుగా నిలిచేవారు. అలాంటి ఉమ్మడి కుటుంబాలు కాలక్రమంలో విడిపోతున్నాయి. గోడలకే కాదు, బంధాల మధ్య బీటలు వస్తున్నాయి. ఆస్తుల గోడలు ఆప్తులను విడదీస్తున్నాయి. నిన్నమొన్నటి దాకా నా అనుకున్న వాళ్లు ఇప్పుడు వాళ్లతో నాకేం సంబంధం అనేలా తయారైంది. మనవాళ్లు అనే ప్రేమలు అడుగంటిపోతున్నాయి. ఎక్కడైనా ఉమ్మడి కుటుంబం ఉందంటే.. 'అరె.. ఇప్పుడు కూడా ఎట్లా కలిసి ఉంటున్నారబ్బా..'అని ఆశ్చర్యపోయే రోజులొచ్చాయి.

### తమను చూసుకుంటూ..

కుటుంబం, బంధాలు, పల్లెటూరి వాతావరణం అంశాలతో తెరకెక్కిన బలగం ప్రధానంగా పల్లెలను ఆకట్టుకుంటోంది. పట్టణవాసులనూ కదిలిస్తోంది. ఇందులో పాత్రలు మనచుట్టూ ఉన్నట్లే, ఒక్కోసారి మనమే అన్నట్లు ఉండటం, ఒకప్పటి ప్రేమలను, బలమైన బంధాలను సినిమా ఒక్కసారి తట్టిలేపడం చాలామందిని ఆకట్టుకుంటోంది. బంధాలు దూర మై, బలగాన్ని కోల్పోతే ఎంత బాధ ఉంటుందో చూ పిన తీరుకు పల్లెజనం కనెక్ట్ అవుతున్నారు. ఇన్నాళ్లు కోల్పోయింది తెరపై కనిపించే సరికి, కన్నీళ్ల రూపంలో బయటకు వస్తోంది. ఈక్రమంలోనే లక్ష్మణచాంద మండలంలో అన్నదమ్ములైన గుర్రం పోసులు, రవి బలగం సినిమా చూసిన తర్వాత హద్దులు చెరిపేసి కలిసిపోయారు. ఏళ్లుగా మాట్లాడుకోని కుటుంబాలు ఇప్పుడిప్పుడు పలకరించుకుంటున్నాయి.



### ఊరూరా చూపిస్తున్నారు..



'రేపు సాయంత్రం 7 గంటలకు మనూరి పంచాయతీ కాడ బలగం సినిమా ఉంటుందహో.. పిల్లలు పెద్దలు ఇంటోళ్లందరూ రావాలహో..' అంటూ చాలా ఊళ్లల్లో దండోరా వేసి మరీ సినిమా చూపిస్తున్నారు. కొంతమంది సర్పంచులు, వీడీసీలు తమ ఊరివాళ్లనే టాకీసులకు తీసుకెళ్లి సినిమా చూపిస్తున్నారు. కుటుంబాలు, బంధాలు బాగుండాలనే కోణంలో కొంతమంది చూపిస్తుంటే, చాలామంది మాత్రం రాజకీయకోణంలో తమకు లబ్ధి జరుగుతుందనే ఆశతో సినిమా చూపిస్తున్నారన్న విమర్శలూ ఉన్నాయి. ఏదిఏమైనా సినిమా చూసిన తర్వాత చాలామంది 'మనకంటూ బంధువులు, బలగం ఉండాలె..' అంటున్నారు.

### బలగమే బలం..



మంచికి చెడుకు, సుఖానికి దుఃఖానికి, దేనికైనా మనవాళ్లంటూ ఉంటేనే మనసు ప్రశాంతంగా ఉంటుంది. ఇప్పటికీ నిర్మల్‌రూరల్ మండలంలోని వెంగ్వాపేటకు చెందిన తోడిశెట్టి భోజన్న కుటుంబం అంటే.. వాళ్ల బలగం పెద్దదని అంటుంటారు. అలా అన్నప్పుడు సంతోషంగా అనిపిస్తుంది.

– తోడిశెట్టి పరమేశ్వర్, ప్రధానోపాధ్యాయుడు, నిర్మల్

### ఇప్పటికీ కలిసే ఉంటూ..



లోకేశ్వరం మండలం పంచగుడి అనుబంధమైన చిన్నమొహాళ గ్రామంలో నాగోరావుపటేల్ కుటుంబం ఇప్పటికీ కలిసే ఉంటుంది. ఇటీవల ఆయన అనారోగ్యంతో మరణించారు. తండ్రి నాగోరావుపటేల్ చనిపోయినా ఆయన కొడుకులైన బాబూపటేల్, ఆనంద్‌రావు, సురేశ్ పటేల్ ఉమ్మడిగానే ఉంటున్నారు. వ్యవసాయం చేసుకుంటూ కష్టాసుఖాలను పంచుకుంటు ముందుకు సాగుతున్నారు. వాళ్ల భార్యలు విజయ, చంద్రకళ, ఛాయతో పాటు పిల్లలూ కలిసి కుటుంబమంతా అన్యోన్యంగా ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

# సింగరేణిని అమ్మేందుకు కుట్ర

- బొగ్గు గనుల వేలం ఆపాలి
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- సీసీసీలో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ మహాధర్నా



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్, వేదికపై మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, నాయకులు

శ్రీరాంపూర్(మంచిర్యాల): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సింగరేణిని అమ్మేందుకు కుట్ర చేస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆరోపించారు. బొగ్గు గనుల వేలం ఆపాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో నాలుగు బొగ్గు బ్లాక్‌లను కేంద్రం వేలం వేయడాన్ని నిరసిస్తూ శనివారం మంచిర్యాల జిల్లా సీసీసీ కార్నర్ వద్ద మహాధర్నా నిర్వహించారు. మోదీ హఠావో.. సింగరేణి బచావో అంటూ బీఆర్ఎస్, టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు కార్మికులకు 10శాతం లాభాలు పంచేవారని, రాష్ట్ర ఏర్పాటు తర్వాత 30శాతం పంచుతున్నామని తెలిపారు. వేల కోట్ల లాభాలు ఆర్జిస్తున్న సింగరేణిపై మోదీ కన్నుపడి బొగ్గుబ్లాక్‌లను ఆదానీకి అప్పగిస్తున్నారని విమర్శించారు. బొగ్గుబ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించినా పట్టించుకోవడం లేదని, రాష్ట్రంలోని బీజేపీ ఎంపీలు, వారి మంత్రులు నిలదీయాలని అన్నారు. ఎన్నికలతోనే వారికి బుద్ధి చెప్పాలని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ 100 సీట్లు మించి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు మాట్లాడుతూ సింగరేణిలో ముఖ్యమంత్రి కేసీఆర్ వల్ల 12వేల మందికి కారుణ్య ఉద్యోగాలు వచ్చాయని భవిష్యత్‌లో సంస్థను కాపాడుకోవాలంటే కేంద్రంతో పోరాడాలని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ మాట్లాడుతూ తెలంగాణకు సింగరేణి గుండెకాయ వంటిదని, దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు.

**తరలొచ్చిన శ్రేణులు**

బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ డివిజన్ల నుంచి పెద్దయెత్తున టీబీజీకేఎస్, బీఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ధర్నా నిర్వహించారు. ముగింపు సమయంలో మోదీ దిష్టిబొమ్మను ఊరేగించి దహనం చేశారు. నాయకులంతా మోదీ హఠావో.. సింగరేణి బచావో అంటూ నినదిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, ఎమ్మెల్యేలు దుర్గం చిన్నయ్య(బెల్లంపల్లి), బాపురావు(బోథ్), ఆత్రం సక్కు(ఆసిఫాబాద్), జోగు రామన్న(ఆదిలాబాద్), జెడ్పీ చైర్‌పర్సన్‌లు నల్లాల భాగ్యలక్ష్మి(మంచిర్యాల), జనార్దన్ రాథోడ్(ఆదిలాబాద్), కోవ లక్ష్మి(కుమురంభీం), మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవిందరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగుంట ప్రవీణ్, టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, నాయకులు ఎస్.విజిత్‌రావు, అక్కూరి సుబ్బయ్య, టీబీజీకేఎస్ నాయకులు మంద మల్లారెడ్డి, డి.అన్నయ్య, ఏనుగు రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు వంగ తిరుపతి, పూదరి కుమార్, మర్రి రాజమౌళి, బేర సత్యనారాయణ, సీపీఐ కౌన్సిలర్లు రేగుంట చంద్రశేఖర్, మేకల దాసు పాల్గొన్నారు.

### తట్టా చెమ్మాస్ తిరగెయ్యాలే..

– విప్ బాల్క సుమన్

బీజేపీ నాయకులను సింగరేణి క్షేత్రంలో తిరగనివ్వొద్దని, వస్తే తట్టాచెమ్మాస్ తిరగెయ్యాలని బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ కార్మికులకు పిలుపునిచ్చారు. సింగరేణి ప్రైవేటీకరణకు కుట్ర చేశారని ఆరోపించారు. సింగరేణికి కొత్త గనులు ఇవ్వకుండా నష్టాల పాలు చేసి ఆదానీకి అప్పగించే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. నాలుగు బొగ్గు బ్లాక్‌లు సింగరేణికే ఇవ్వాలని బీజేపీ మంత్రి కిషన్‌రెడ్డి, వారి ఎంపీలు ఎందుకు కేంద్రానికి లేఖ రాయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. గుజరాత్‌లో లిగ్నైట్ మైన్స్‌ను అక్కడి ప్రభుత్వం కోరగా వేలం వేయకుండా ఇచ్చిన కేంద్రం తెలంగాణలో ఎందుకు వివక్ష చూపుతోందని ప్రశ్నించారు. మైన్స్ రాకుంటే కారుణ్య ఉద్యోగాలు ఇచ్చుకోలేని పరిస్థితి వస్తుందని, కార్మికవర్గం కేంద్రంపై తిరగబడాలని పిలుపునిచ్చారు. మోదీ, అమిత్‌షా, బండి సంజయ్, ధర్మపురి అరవింద్ చదువు ఫేక్ సర్టిఫికెట్లేనని, వారి బండారం బయటపెడతామన్నారు.

# అకాల నష్టం!



చించాలలో వర్షానికి తడిసిన మొక్కజొన్నను సరి చేస్తున్న రైతులు



మొహాళలో తడిసిన పసుపుతో మహిళా రైతు



రాయాపూర్‌కాండ్లీలో వాలిన నువ్వు పంట

లోకేశ్వరం/ముథోల్/కుంటాల/లక్ష్మణచాంద/సారంగపూర్: ఆరుగాలం శ్రమించి రైతులు సాగుచేస్తున్న పంటలు చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలు ఏటా అపార నష్టం కలిగిస్తున్నాయి. తాజాగా వరి, మొక్కజొన్న పంటలు చేతికి వచ్చే దశలో ఉన్నాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి లోకేశ్వరం, లక్ష్మణచాంద మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. చేతికి వచ్చిన పంట దిగుబడి తడిసింది. లోకేశ్వరం మండలం జోహర్‌పూర్, అబ్దుల్లాపూర్, రాయపూర్‌కాండ్లీ, ధర్మోరా, పంచగుడి, పిప్రి, వట్టోలి, సాథ్‌గాం, సెవాలాల్‌తండా, ఆర్లిగొడిసెరా, నగర్, గడ్‌చాంద తదితర గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. దీంతో వరి, మొక్కజొన్న, నువ్వు పంటలు దెబ్బతిన్నాయి. మిర్చి, పొద్దుతిరుగుడు, పసుపు, సజ్జ పంటలకు నష్టం కలిగింది. కల్లాల్లో ఆరబెట్టిన పసుపు, మొక్కజొన్న పంట తడిసింది. ముథోల్ మండల కేంద్రంతోపాటు ఆష్టా, గన్నోర, బ్రాహ్మణ్‌గావ్, విఠోలి, వెంకటాపూర్, చించాల గ్రామాల్లో శుక్రవారం రాత్రి కురిసిన వడగండ్ల వానకు మొక్క జొన్న చేలు నేలవాలాయి. కల్లాల్లో ఆరబెట్టిన పంట పూర్తిగా తడిపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. కుంటాల మండలం వెంకూర్, అందకూర్, ఓలా, కుంటాల, సూర్యపూర్, లింబా(కె), లింబా(బి) గ్రామాల్లో శనివారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఈ వర్షానికి నువ్వుపంటకు నష్టం కలిగింది. ఓలా, అంబకంటి, కుంటాల గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలాయి. నూర్పిడి చేసి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంకూర్, ఓలా ఫీడర్లలో ఇన్సులేటర్లు చెడిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేపట్టి సరఫరా పునరుద్ధరించారు. లక్ష్మణచాంద, సారంగాపూర్ మండలాల్లో శనివారం ఉదయం వర్షం కురిసింది. పలు గ్రామాల్లో మొక్కజొన్న ధాన్యం తడిసింది. సారంగపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆరబోసిన మొక్కజొన్న పంట తడిసిపోయింది. మార్కెట్ యార్డు మొత్తం సీసీ ప్లాట్‌ఫాం ఉండటంతో నీరు మొక్కజొన్న ధాన్యం కిందకు చేరింది. ఈదురుగాలులకు నువ్వు పంట నేలవాలిందని రైతులు పేర్కొన్నారు.



అందకూర్‌లో మొక్కజొన్న కుప్పలపై టార్పాలిన్‌లు



రాచాపూర్ సమీపంలో తడిసి ధాన్యం

# సకాలంలో పన్ను చెల్లించాలి

- ప్రాంతీయ రవాణా సహాయ అధికారి హరీంద్రకుమార్



మాట్లాడుతున్న హరీంద్రకుమార్

సారంగపూర్: కమర్షియల్ వాహనాల యజమానులు సకాలంలో రోడ్‌ట్యాక్స్ చెల్లించి ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ చేయించుకుని వాహన ధ్రువపత్రాలన్నీ సక్రమంగా నిర్వహించాలని ప్రాంతీయ రవాణా సహాయ అధికారి హరీంద్రకుమార్ అన్నారు. మండలంలోని బీరవెల్లి గ్రామంలో వాహన యజమానులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండల వ్యాప్తంగా మొత్తం 260 కమర్షియల్ వాహనాలకు సంబంధించి పత్రాల పెండింగ్, రోడ్డు ట్యాక్సులు చెల్లించకుండా బకాయి ఉన్నారని తెలిపారు. వారంతా వెంటనే చెల్లించి వాహనాల ధృవపత్రాలు అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. పన్ను చెల్లించకుండా రోడ్డెక్కితే 200 శాతం జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

# వాహనంతో వచ్చిన సైలెన్సరే వాడాలి

- డీఎస్పీ జీవన్‌రెడ్డి



పరిశీలిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి, పోలీసులు

నిర్మల్‌టౌన్: ద్విచక్రవాహనాలకు షోరూమ్ నుంచి వాహనంతోపాటు వచ్చిన సైలెన్సర్లనే వాడాలని నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని మంచిర్యాల చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం 100 సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో తొక్కించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాలకు పెద్ద శబ్దాలు వచ్చే సైలెన్సర్లు బిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల కాలంలో దాదాపు 100 వాహనాల సైలెన్సర్లను ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నట్లు చెప్పారు. కొన్ని రోజుల నుంచి కాలేజీలు, బస్టాండ్ వద్ద పెద్ద శబ్దం చేస్తూ నడుపుతున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ టీఎస్16 ఈఎన్ 5499 ద్విచక్ర వాహనాన్ని శనివారం ఆర్టీవోకు అప్పగించామని తెలిపారు. ఆ వాహన యజమానిపై కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం పట్టణ ట్రాఫిక్ పోలీసులను అభినందించారు. ఇందులో పట్టణ సీఐ మల్లేశ్, ట్రాఫిక్ ఎస్సై దేవేందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




లోకేశ్వరం: మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద నిర్మించిన గోదాంలో నిల్వ ఉంచిన రేషన్ షాపులకు సంబంధించిన బియ్యం తడిసింది. గోదాంలో బియ్యం సంచులను ఆరుబయట నిల్వ చేయడంతో వర్షానికి తడిసిపోయాయి.

## క్లుప్తంగా

### పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత




ఫోన్ అప్పగిస్తున్న హెడ్‌కానిస్టేబుల్

సారంగపూర్(నిర్మల్): మండలంలోని వంజర్ సర్పంచ్ లక్ష్మణ్ తన సెల్‌ఫోన్ ఈ ఏడాది జనవరిలో బండరేవుతండా నానూమహారాజ్ జాతరలో పోయిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఐటీ కోర్ నిర్మల్ ఆర్ఎస్ఐ రవి నాయుడు సహకారంతో లొకేషన్‌ను బట్టి ఫోన్ మహారాష్ట్రలో ఉందని గుర్తించారు. అక్కడికి వెళ్లి ఫోన్ స్వాధీనం చేసుకుని శనివారం సర్పంచ్‌కు అప్పగించారు. తన ఫోన్ కనిపెట్టిన ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, సిబ్బందికి సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన తేజశ్రీ



తేజశ్రీని అభినందిస్తున్న కరస్పాండెంట్

మంచిర్యాలఅర్బన్: జిల్లా చెస్ అసోసియేషన్, తెలంగాణ రాష్ట్ర చెస్ అసోసియేషన్ సంయుక్తంగా మందమర్రిలో నిర్వహించిన అండర్ –17 చెస్ పోటీల్లో స్థానిక ది హ్యాపీ స్కాలర్ స్కూల్ విద్యార్థి తేజశ్రీ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్న పోటీల్లో విద్యార్థిని పాల్గొననుంది. కరస్పాండెంట్ విక్రమ్‌రావు అభినందించారు.

### విద్యుత్‌వైర్లు తెగిపడి మొక్కజొన్న పంట దగ్ధం



దగ్ధమైన మొక్కజొన్న పంట

సారంగపూర్(నిర్మల్): విద్యుత్ వైర్లు తెగిపడి మొక్కజొన్న పంట దగ్ధమైన సంఘటన మండలంలోని జామ్‌లో చోటు చేసుకుది. గ్రామానికి చెందిన కండెల భోజన్న అనే రైతు తనకున్న ఎకరా పంటచేలలో సాగుచేసిన మొక్కజొన్న చేనును కోతకోసి ఆరబెట్టాడు. శనివారం తెల్లవారు జామున వీచిన గాలులకు 11కేవీ విద్యుత్ తీగలు తెగిపడడంతో నూర్పిడికి సిద్ధంగా ఉన్న మొక్కజొన్న పంట కాలిబూడిదైంది. పంట విలువ సుమారు రూ.70వేల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో విద్యుత్ వైర్లు సరిచేశారు.

### విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పింజారిగుట్టలో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన అల్లం రాజు ఉదయం పని నిమిత్తం దుకాణానికి వెళ్లాడు. వారం క్రితమే అతని భార్య పుట్టింటికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు రాజుతో పాటు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఫైరింజన్ వచ్చేలోగానే బోరు నీటితో మంటలను ఆర్పేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న సామగ్రి కాలిపోయింది. ప్రమాదంలో సుమారు రూ.లక్ష వరకు ఆస్తినష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

# వీరి పేరేమి..!

పిల్లలు పుట్టారంటే చాలు మంచి పేరు పెట్టాలనే తపన తల్లిదండ్రుల్లో కనిపిస్తుంది. జన్మనక్షత్రం.. ఇష్టదైవం.. కులదైవం పేరు, పేరులోని అక్షరమైన కలిసివచ్చేలా నామకరణం చేయాలనే ఆసక్తి అందరిలోనూ ఉంటుంది. ఇలా ఒకే రకమైన పేర్లు.. ఒకే ఊరిలో ఉన్న వారు చాలామందే ఉన్నారు. ఇంటి పేరు చెబితే గానీ వారి అచూకీ తెలియదంటే అతిశయోక్తి కాదు. ఆ పేర్ల వెనుక చరిత్ర ఏమిటో తెలుసుకుందాం.

– సాక్షి, మంచిర్యాలడెస్క్

- పిల్లలకు దేవుళ్ల పేర్లు
- ఒక్కో పేరు వెనుక ఒక్కో చరిత్ర




అడెల్లిలోని మహాపోచమ్మ ఆలయం (ఫైల్)

### స్నేహానికి గుర్తు.. లచ్చుపటేల్



హైమన్‌డార్ఫ్ కొడుకు లచ్చుపటేల్



లచ్చుపటేల్‌తో హైమన్‌డార్ఫ్(ఫైల్)

మానవ శాస్త్రవేత్త హైమన్‌డార్ఫ్ ఆదివాసీల జీవన విధానం, సమస్యలపై అధ్యయనం చేయడానికి కొన్ని దశాబ్దాల క్రితం కుమురం భీం జిల్లా జైనూర్ మండలం మార్లవాయి గ్రామానికి వచ్చారు. అప్పట్లో ఆయనకు ఎవరూ ఇక్కడ ఆశ్రయం కల్పించలేదు. దీంతో గ్రామ పటేల్‌గా ఉన్న లచ్చుపటేల్ హైమన్‌డార్ఫ్, ఆయన భార్య ఎలిజబెత్‌కు గ్రామంలో ఆశ్రయం కల్పించాడు. ఆ తర్వాత హైమన్‌డార్ఫ్ పరిశోధనకు లచ్చుపటేల్ అన్ని రకాలుగా సహకరించాడు. ఈ క్రమంలో వారి మధ్య స్నేహం ఏర్పడింది. హైమన్‌డార్ఫ్ తన భార్య ఎలిజబెత్ ప్రసవం కోసం స్వదేశం లండన్‌కు వెళ్లారు. ఆయన తిరిగి వచ్చేసరికి తనకు ఆశ్రయం కల్పించిన లచ్చుపటేల్ చనిపోయాడని తెలిసి బాధపడ్డాడు. తమ స్నేహానికి గుర్తుగా హైమన్‌డార్ఫ్ తన కుమారుడికి లచ్చుపటేల్ అలియాస్ నికోలస్ అని నామకరణం చేశారు.

### గజ్జలమ్మ

నిర్మల్ జిల్లా కుంటాల మండల కేంద్రంలో గజ్జలమ్మ అమ్మవారి ఆలయం ఉంది. కొన్ని దశాబ్దాల క్రితం మూసరి వంశస్తులు వేటకు వెళ్లేవారు. ముత్యం అనే వ్యక్తికి నీటి మడుగులో రాతి విగ్రహం కనిపించిందని, కలలోకి వచ్చి విగ్రహం ప్రతిష్టించాలని చెప్పడంతో మరుసటి రోజు గ్రామ శివారులో ప్రతిష్టించారని కథనం ప్రచారంలో ఉంది. ప్రతీ ఆదివారం అమ్మవారికి మొక్కులు, నైవేద్యాలు చెల్లించుకుంటారు. అమ్మవారి పేరుమీదుగా పిల్లలకు పేర్లు పెడుతున్నారు. గ్రామంలో 1500కు పైగా జనాభా ఉన్నారు. అమ్మాయిలకు గజ్జవ్వ, గజ్జలమ్మ, అబ్బాయిలకు గజ్జారాం, పెద్ద గజ్జారాం, నడిపి గజ్జారాం అనే పేర్లు పెడుతుంటారు. ఇలా పేర్లు ఉన్నారు చాలామంది ఉన్నారు. ఇప్పటికీ గజ్జారం, గజ్జలమ్మ పేరు పలికిన తర్వాతే ఏదైనా వేరే పేరు పెడుతుంటారు. అమ్మవారి భక్తులు ముంబయిలోనూ ఆలయం నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్టించారు. కుభీర్‌లోనూ అమ్మవారి పేరిట ఆలయం ఉంది.



### పురాతన ఆలయం..

నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని అడెల్లి గ్రామంలో మహాపోచమ్మ కొలువై ఉంది. పురాతనమైన ఈ ఆలయం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. నిజామాబాద్, వరంగల్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి ప్రతీ ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకుంటారు. అమ్మవారి పేరు మీదుగా పిల్లలకు పేర్లు పెడుతుంటారు. పోశెట్టి, పోసవ్వ, ఒకే ఇంట్లో ముగ్గురు ఉంటే పెద్ద పోశెట్టి, నడిపి పోశెట్టి, చిన్న పోశెట్టి అని నామకరణం చేస్తుంటారు. ఇక వ్యాపార సముదాయాలు, వాహనాలకు సైతం పోచమ్మ పేరు పెడుతుంటారు. పోచమ్మ మిల్క్ సెంటర్, అడెల్లి పోచమ్మ ఫాస్ట్ ఫుడ్, అడెల్లి పోచమ్మ కిరాణం ఇలా చాలావరకు వ్యాపార సముదాయాలకు పేర్లు ఉన్నాయి.

- మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం రేచిని గ్రామంలో కుర్మ కులస్తుల కుటుంబాల 270 వరకు ఉన్నాయి. వీరిలో ఎక్కువగా బీరయ్య అనే పేరుగల వారే అధికంగా ఉన్నారు. దుర్కి బీరయ్య, మురికి బీరయ్య, ముదిగిరి బీరయ్య, చిన్న బీరయ్య, నడిపి బీరయ్య ఇలా 30మందికి పైగా ఉన్నారు.
- నిర్మల్ జిల్లా భైంసా మండలం చుచుంద్ గ్రామంలో సుమారు 1400 జనాభా ఉంటారు. గ్రామంలో సిద్ధేశ్వరాలయం ఉంది. దేవుడి పేరు మీదుగా పిల్లలకు పేర్లు పెడుతుంటారు. సిద్ధేశ్వర్, సిద్ధు, సిద్ధయ్య, సిద్ధాంత్ ఇలా గ్రామంలో ఇంటికొకరు ఉన్నారు.
- నిర్మల్ జిల్లా కుభీర్ మండలం పార్డి(బీ)లో రాజరాజేశ్వర ఆలయం ఉంది. దీంతో గ్రామంలో ఎక్కువ మంది తమ పిల్లలకు ఆ దేవుళ్ల పేరు కలిసి వచ్చేలా పెడుతుంటారు. పెర్క రాజేశ్వర్, తూము రాజేశ్వర్, రాజన్న, జంగం రాజన్న, జంగాల రాజేశ్వర్, చిమ్మన్ రాజేశ్వర్, ఈర్ల రాజేశ్వర్, గుడాల రాజలింగు, కోలుకొండ రాజేశ్వర్, పాట్లోళ్ల రాజేశ్వర్, వడ్ల రాజన్న, శాల రాజేశ్వర్, చిట్యాల రాజేశ్వర్, తిమ్మాపూర్ రాజేశ్వర్, శేరె రాజేశ్వర్, కన్నాల రాజన్న, తిప్ప రాజేశ్వర్, గోపు రాజేశ్వర్, ప్యారామూర్ రాజేశ్వర్, కుర్మ రాజేశ్వర్, రాజవ్వ, రాజమణి, రాజేశ్వరి ఇలా సుమారు 500 మంది వరకు ఉంటారు.
- నిర్మల్ జిల్లా తానూరు మండలం బొంద్రట్ గ్రామంలోని గుట్ట ప్రాంతంలో అమృత్ సాబ్ ఆలయం ఉంది. ఆ గ్రామంలో ఎక్కువగా అమృత్ పేర్లు ఉన్నాయి. చిన్న అమృత్, పెద్ద అమృత్, నడిపి అమృత్ పేర్లు ఉన్నాయి. ఆలయంలో ఇక్కడి గ్రామాల ప్రజలు మొక్కులు చెల్లించుకోవడంతోపాటు అబ్బాయిలు జన్మిస్తే ఎక్కువగా ఇదే పేరు పెడుతుంటారు.

**ఇష్టదైవం..**

లక్ష్మణచాంద మండలం పొట్టపెల్లి(కే) గ్రామంలో వెయ్యి మందికి పైగా జనాభా ఉన్నారు. వీరిలో 100 నుంచి 150 మంది వరకు సాయన్న పేరు గలవారు ఉన్నారు. సాయన్న, నడిపి సాయన్న, పెద్ద సాయన్న అనే పేర్లు ఎక్కువగా వుంటాయి. బాల్కొండలో ఉన్న తమ ఇష్ట దైవం పేరిట పిల్లలకు పేర్లు పెడుతుంటారు. పిల్లల పుట్టు వెంట్రుకలు అక్కడే తీసి కందూరు చేసి పేర్లు పెడుతుంటారు.

### ప్రతీ ఇంటా అమ్మవారి పేర్లు



కుంటాలలో వెలిసిన గజ్జలమ్మ దేవి భక్తుల కోరికలను నెరవేర్చడంతో ప్రతి ఇంటా అమ్మవారి పేర్లను పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోంది. మా కుటుంబంలో అక్కకు గజ్జలమ్మ అని, ఇద్దరం అన్నదమ్ములకు చిన్న గజ్జారాం, పెద్ద గజ్జారాం అని పేర్లు పెట్టారు. నిత్యం అమ్మవారిని కొలిచనట్టుగా భావిస్తుంటాం. అమ్మవారి దయ ఉంటే అన్నీ ఉన్నట్లే.

– అప్క చిన్న గజ్జారాం, అప్క పెద్ద గజ్జారాం, కుంటాల

### శివరాత్రికి పుట్టువెంట్రుకలు తీస్తారు..



మా గ్రామంలో ఉన్న ఆలయం 500 ఏళ్ల పురాతనమైనది. అందువల్లే ఎక్కువ మంది తమ పిల్లలకు దేవుని పేరు పెట్టుకుంటారు. ప్రతీ శివరాత్రికి ఆలయంలో దేవుని కల్యాణం జరిపిస్తాం. ఆ కల్యాణం జరిగిన తర్వాతే గ్రామంలో పెళ్లిళ్లు జరుగుతాయి. దేవుని పేరు పెట్టిన పిల్లల పుట్టువెంట్రుకలు శివరాత్రి రోజు మాత్రమే ఆలయం వద్ద తీస్తారు. ఇది తరతరాల ఆనవాయితీగా వస్తోంది.

– తూము రాజేశ్వర్, పార్డి(బి), మం: కుభీర్

### మా ఊర్లో 150 మందికి అవే పేర్లు



నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం పొట్టపెల్లి(కే) మా గ్రామం. మా కుల దైవం తుర్కదేవుడు బాల్కొండ గ్రామంలో ఉంది. దీంతో మా దేవుని పేరుతోనే మా తాతలు, నాన్నలు, ఇప్పుడు మా పేర్లు, మా పిల్లల పేర్లు ఉన్నాయి. మేము ముగ్గురు అన్నదమ్ములం. నేను చిన్న వాడిని దీంతో నా పేరు చిన్న సాయన్న అని పెట్టారు. మా అన్నల పేర్లు పెద్ద సాయన్న, నడిపి సాయన్నగా ఉంది.

– చిన్న సాయన్న, పొట్టపెల్లి(కే)

## 'బలగం'తో కదిలొచ్చి..



దండేపల్లి(మంచిర్యాల): కుటుంబ ఆవశ్యకతను తెలిపే బలగం సినిమా ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. సినిమాను పలు గ్రామాల సర్పంచ్‌లు ఆయా గ్రామాల్లో ఉచితంగా ప్రదర్శిస్తున్నారు. దండేపల్లి మండలం తాళ్లపేట, నర్సాపూర్ గ్రామాల్లో శనివారం రాత్రి సినిమా ప్రదర్శించడంతో కుటుంబ సమేతంగా కదలివచ్చి తిలకించారు.

## హెచ్చరించినా మారని తీరు

- పెరుగుతున్న డ్రంకెన్‌డ్రైవ్ కేసులు
- పట్టుబడుతున్న వాహనదారులు




డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు చేస్తున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో మద్యం తాగి వాహనాలు నడిపే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. నిత్యం వివిధ గ్రామాల నుంచి పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చే వాహనదారులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పోలీసులకు పట్టుబడుతున్నారు. మద్యం మత్తులో బండి నడపడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. పోలీసులు పలుమార్లు హెచ్చరించినా వాహనదారుల తీరు మారడం లేదు. దీంతో మద్యం తాగి వాహనం నడిపే వారికే కాకుండా, ఎదురుగా వచ్చే వారికి కూడా ప్రమాదం జరిగే ఆస్కారం ఉంది. గడిచిన మూడు నెలల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన వారి సంఖ్య పెరుగుతోంది. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. వారంలో ఒకరోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నారు. వారికి శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నారు. వీరితోపాటు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపైనా చర్యలు తీసుకుంటున్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడం, నంబర్ ప్లేట్లు సరిగా లేకపోవడం, నంబర్లు కనిపించకుండా చేయడం, మైనర్లు వాహనాలు నడపడం, సిగ్నల్ క్రాసింగ్, ట్రిపుల్ రైడింగ్, ఇతర ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం లాంటివి చేసే వారిని పట్టుకుంటున్నారు. ముఖ్యంగా డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు.

| నెల | స్పెషల్‌డ్రైవ్ | పట్టుబడినవారు | జైలుశిక్ష | జరిమానా(రూ.ల్లో) |
|---|---|---|---|---|
| జనవరి | 05 | 214 | 10 | 2,97,500 |
| ఫిబ్రవరి | 03 | 101 | 10 | 1,23,900 |
| మార్చి | 02 | 66 | 02 | 87,200 |
| ఏప్రిల్ | 01 | 22 | 02 | 25,100 |



### ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే చర్యలు



మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. అలాంటి వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తాం. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తాం. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం.

– మల్లేశ్, పట్టణ సీఐ

### మరిన్ని తనిఖీలు చేపట్టాలి



యువత మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. వారికే కాకుండా ఎదురుగా వచ్చే వారికి ప్రమాదం పొంచి ఉంది. మద్యం సేవించి వాహనాలు నడపకుండా పోలీసులు అవగాహన కల్పించాలి. మరిన్ని తనిఖీలు చేపట్టాలి.

– జోగు చంద్రశేఖర్, శాస్త్రినగర్

## బస్సు ఢీకొని బాలికకు గాయాలు



చికిత్స పొందుతున్న బాలిక

భైంసారూరల్(ముధోల్): మండలంలోని దేగాం గ్రామంలో శనివారం ఆర్టీసీ బస్సు ఢీ కొని బాలికకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన బాలిక సావిత్రి మలవిసర్జన కోసం రోడ్డు దాటుతుండగా నిజామాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో బాలికకు తీవ్రగాయాలు కావడంతో 108లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ మ్యాన్ పవర్ & సెక్యూరిటీ ఫీల్డ్‌లో అనుభవమున్న ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను. Contact : Mega Group Man Power & Security. Cell : 70326 10569, 70931 25169. [NA-5483]

■ Digital Marketing కొరకు Marketing Executives కావలెను సంప్రదించండి. ఫోన్ : 9959484341 [H-778982]

■ HYDలో అర్జంటుగా సెక్యూరిటీ గార్డ్స్, RTC కార్గో బస్‌లకు బాయ్స్, అటెండర్స్ కావలెను. (కన్సల్టెన్సీ కాదు) మంచి జీతం: వసతి కలదు. సంప్ర: 040 -66366664, 9392663777, 9246663777 [HA-1330]

■ గుంటూరు దగ్గర గల ఆఫీసులో ఉండి పనిచేయుటకు టైపింగ్, డ్రైవింగ్ తెలిసిన జూనియర్ లాయర్స్ మరియు డ్రైవర్స్ కావలెను. సంప్రదించండి. ✆ 9666114383/7207007725 [G-779538]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,

### రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

దస్తురాబాద్: ఈ నెల 5న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని మున్యాల గ్రామానికి చెందిన కల్మి సుధాకర్ (42)శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సుధాకర్ హనుమాన్ మాల విరమణ చేయడానికి ద్విచక్ర వాహనంపై కొండగట్టుకు బయలుదేరాడు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్ల వద్ద మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు.

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్ కాలనీలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ రహదారిలో శనివారం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో కైలాస్‌నగర్ కాలనీకి చెందిన ఆడిపల్లి సాయి, అభిలాష్, దస్నాపూర్ కాలనీకి చెందిన నర్సింగ్‌కు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

### ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బోథ్: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కౌఠ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దీటి రాజు (34)కు పదిహేనేళ్ల క్రితం సునీతతో వివాహమైంది. దంపతులకు ఇద్దరు కుమార్తెలు. రాజు భార్య అదే గ్రామానికి చెందిన ఇట్టెడి ఉదయ్‌కిరణ్‌రెడ్డితో అక్రమ సంబంధం పెట్టుకుందని మానసికవేదనకు గురయ్యాడు. అంతేకాకుండా ఉదయ్‌కిరణ్‌రెడ్డితో పాటు జన్నారపు నడిపి గంగయ్య, జన్నారపు ప్రవీణ్, జన్నారపు రాజు చంపుతారని బెదిరిస్తున్నారని అతని తల్లి దీటి సుశీల పేర్కొన్నారు. దీంతో మనోవేదనకు గురైన రాజు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి సుశీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### వివాహితను వేధించిన వ్యక్తిపై కేసు

భైంసాటౌన్(ముధోల్): భైంసా పట్టణానికి చెందిన ఓ వివాహితను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ ఎల్ శ్రీను తెలిపారు. నిర్మల్‌కు చెందిన ఎండీ జుబేర్ తనను పెళ్లి చేసుకోవాలంటూ ఏడాదికాలంగా వేధిస్తున్నాడని, లేకపోతే చంపుతానని బెదిరిస్తున్నట్లు సదరు వివాహిత శనివారం ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

### గుడుంబా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

భీమారం(చెన్నూర్): గుడుంబా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు మంచిర్యాల ఎక్సైజ్‌శాఖ సీఐ నరేందర్ తెలిపారు. తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు శనివారం భీమా రం–చెన్నూర్ ప్రధాన రహదారిలోని బూర్గుపల్లి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా గమనించిన నిందితుడు బైక్‌ని వదిలేసి పారిపోతుండగా ప ట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అతని వద్ద పది లీటర్ల గుడుంబా లభ్యమైనట్లు ఆయన పే ర్కొన్నారు. గుడుంబాతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడు చామన్‌పల్లికి చెంది న మాలోతు రమేశ్‌నాయక్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సై వసంతరావు, సిబ్బంది రాజేంద్రప్రసాద్, ఉమారాణి పాల్గొన్నారు.

### పేకాటరాయుళ్ల అరెస్టు

బెజ్జూర్: మండలంలోని మర్తడి గ్రామ సమీపంలో గల పెద్దవాగులో శనివారం ఎస్సై వెంకటేశ్ ఆధ్వర్యంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. రాజన్న, శ్రీను, అశోక్‌తో పాటు మరో ఇద్దరిని అరెస్టుచేసి వారివద్ద నుంచి రూ.7వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

### కాసిపేటగనిలో కార్మికుడికి గాయాలు

కాసిపేట(బెల్లంపల్లి): మందమర్రి ఏరియాలోని కాసిపేటగనిలో శనివారం తెల్లవారు జామున జరిగిన ప్రమాదంలో కోల్‌కట్టర్ కార్మికుడు కా చు రాజ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. 19డిప్ 3సీంలో ఉల్లు కోస్తుండగా స్లాబ్ కూలి అతని భుజంపై పడింది. గమనించిన తోటి కార్మికులు వెంటనే చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించా రు. ఆస్పత్రిలో రాజ్‌కుమార్‌ను ఏజెంట్ కుర్మ రాజేందర్, గని అధికారులు పరామర్శించారు.

### మద్యం మత్తులో ఒకరు మృతి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బనార్‌వాడకు చెందిన చాప్లె శంకర్ (39) మద్యం మత్తులో మృతి చెందినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్న శంకర్ శుక్రవారం మద్యం సేవించి ఇంట్లో పడుకున్నాడు. తల్లి చాప్లె బయ్యాబాయి లేపడంతో స్పందించలేదు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

### రోడ్డు ప్రమాదంలో చుక్కలదుప్పి మృతి

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ శివారు ప్రాంతంలో బజారు ఏరియా నుంచి శాంతిఖని గనికి వెళ్లే మార్గంలో రోడ్డుపై చుక్కలదుప్పి మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు. విషయం తెలుసుకున్న బెల్లంపల్లి అటవీశాఖ రేంజ్ అధికారి సుభాష్ సంఘటన స్థలాన్ని సందర్శించారు.